సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



క్రిస్మస్ కోలాహలం

జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ కోలాహలం కనిపిస్తోంది. చర్చిలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించడంతో కొత్త శోభను సంతరించుకున్నాయి. -8లో



మద్యం మత్తు.. ప్రాణాలు చిత్తు

మద్యం మత్తు, అతి వేగం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. మద్యం తాగి ఆటోను నడుపుతూ ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొనడంతో దంపతులు దుర్మరణం చెందారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.100	రూ.160

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 174 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలు స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హార్సిలీహిల్స్‌పై డీఆర్‌ఓ

బి.కొత్తకోట: జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు ఆదివారం హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. కొండపై పలు ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. డీఆర్‌ఓగా బాధ్యతలను చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన ఇక్కడికి వచ్చారు. తహసీల్దార్ మహ్మద్ అన్సారీ హార్సిలీహిల్స్‌కు సంబంధించిన విషయాలను ఆయనకు వివరించారు. అనంతరం ఇక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లారు.

నూతన నియామకం



మంజుల

గాలివీడు: అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్ ఏపీ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఎం. మంజులను నియమించినట్లుగా ఆదివారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. గాలివీడు పీహెచ్‌సీ లో స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న తనను అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌ఎండీ ముజహీద్ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

26న శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ జాతరకు వేలం

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ దేవస్థానంలో ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్న జాతరకు సంబంధించి వేలంపాటను ఈనెల 26వన నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతరలో తలనీలాలు, కొబ్బరి కాయలు, టోల్గేట్, ప్రతి ఆదివారం ఏడాది పాటు ఆలయం ముందు కొబ్బరికాయలు, పూలదండల విక్రయానికి సంబంధించిన వేలం భక్తులు, గ్రామస్తుల సమక్షంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ. 50 వేలు డిపాజిట్ చేసి పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి బంగారు కిరీటం



బంగారు కిరీటాన్ని ఆలయ అధికారులకు అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామికి చెన్నైకు చెందిన భక్తులు బంగారు కిరీటాన్ని బహూకరించారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన ఎస్. వసంతలక్ష్మీ, ఆమె కుమార్తె మాధవీ, అల్లుడు మనోహర్, కుటుంబ సభ్యులు కలిసి రూ. 27,01,587 విలువ చేసే 340.630 గ్రాముల బంగారు కిరీటాన్ని ఆదివారం ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలను దాతలకు అందజేశారు. అనంతరం దాతలు బంగారు కిరీటాన్ని టీటీడీ సూపరింటెండెంట్ మునిబాలకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి, అర్చకులు గోపాలాబట్టర్, కృష్ణప్రసాద్‌బట్టర్, అనిల్ కుమార్, గోకుల్‌స్వామి పాల్గొన్నారు.

హాస్టల్ మరమ్మతులకు రూ.13.90 కోట్లు



సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎస్. జయప్రకాష్

పీలేరు రూరల్: జిల్లాలో 43 సాంఘిక సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు రూ.13.90 కోట్లు నిధులు మంజూరైనట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జయప్రకాష్ తెలిపారు. ఆదివారం పీలేరులోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పీలేరు డివిజన్‌లో 12 వసతిగృహాలకు రూ. 4.19 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, ఎస్. బోదేషావలి, వార్డెన్లు రమాదేవి, కుసుమకుమారి పాల్గొన్నారు.

చరిత్ర విధ్వంసం!

విజయనగర రాజుల కాలంలో నిర్మించిన ఆలయాలు క్రమంగా కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అక్కడక్కడ చారిత్రక సంపదకు సాక్ష్యంగా నిలిచిన ఆలయాలను కూడా దుండగులు గుప్త నిధుల పేరుతో మింగేస్తున్నారు. నాటి వైభవాన్ని తెలిపే ఆలయాలు, శిల్పకళను కాపాడాల్సిన బాధ్యత పురావస్తు శాఖ అధికారులపై ఎంతైనా ఉంది. ప్రభుత్వం పురాతన ఆలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకొని చారిత్రక సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

- క్రీస్తుశకం 1336–1646 మధ్యకాలంలో విరాజిల్లిన పాళ్యం గ్రామం
- అద్భుత శిల్పకళతో రంగనాథస్వామి ఆలయ నిర్మాణం
- కూల్చేసిన గోపురం, గర్భగుడిలో తవ్వకం
- గుప్త నిధుల కోసం శివలింగం ముక్కలు
- శిథిలమై..కాలగర్భంలో కలిసిన ఆలయాలు
- ఆనవాళ్లుగా నిలిచిన శిథిల కట్టడాలు



ప్రస్తుత ఆలయం, కనిపించని గర్భగుడి గోపురం (ఇన్‌సెట్) 2022లో రంగనాథస్వామి ఆలయం (ఫైల్)

బి.కొత్తకోట: పాళేగాళ్ల పాలనకు, విజయనగర రాజ్య పాలనా కాలానికి గుర్తుగా చారిత్రిక చిహ్నంగా నిలిచిన గొప్ప ఆలయాలు గుప్త నిధుల ముఠాల దెబ్బకు కాలగర్భంలో కలసిపోతున్నాయి. గత వైభవానికి, గత చరిత్రను తెలిపే సాక్ష్యంగా నిలిచిన సాంస్కృతిక వారసత్వంగా ఉన్న బి.కొత్తకోట మండలం గట్టుకు దక్షిణాన సమీప కొండపై నిర్మించిన చారిత్రక రంగనాథస్వామి ఆలయాన్ని గుప్త నిధుల ముఠాలు పూర్తిగా ధ్వంసం చేసేశారు. అద్భుతమైన శిల్పకళతో నిర్మించిన ఆలయం ఉనికి కోల్పోయింది. రంగనాథస్వామి ఆలయాన్ని కూల్చేయగా ప్రస్తుతం శిథిలాల కుప్పగా కనిపిస్తోంది. 2022 డిసెంబర్ ఏడున సాక్షిలో 'చెదురుతున్న చరిత్ర' శీర్షిక ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఆనాటికి ఆలయం, గోపురం, గర్భగుడి ఉండేవి. వాటి పునరుద్ధరణకు వీలయ్యేది. ఇప్పుడు పునరుద్ధరణ పనులు చేపట్టలేని విధంగా ఆలయంలో విధ్వంసం సృష్టించారు. గుప్త నిధుల ముఠాల దెబ్బకు చరిత్రకు సాక్ష్యంగా భావి తరాలకు అందాల్సిన చరిత్ర కనుమరుగైంది.

పాళ్యానిది విశిష్ట చరిత్ర

క్రీస్తుశకం 1336–1646 మధ్యకాలంలో విజయనగర రాజుల పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో పాళేగాళ్ల ప్రభావం ఉండేది. పాళేగాళ్లలో ములకలచెరువు మండలం సోంపాళ్యం పాళేగాళ్లు బలమైన వాళ్లుగా చరిత్రలో చెబుతారు. అప్పట్లో గట్టు గ్రామం ఏర్పాటు కాని రోజుల్లో బి.కొత్తకోట మండలం ప్రస్తుత గట్టుకు సమీప దక్షిణాన గట్టు కొండ వెనుకవైపున కొండపై దట్టమైన అటవీప్రాంతం ఉండేది. సోంపాళ్యం చెందిన పాళేగాళ్ల సోదరులు వెంకటపతినాయుడు, దొరప్పనాయుడు ఈ ప్రాంతాన్ని పాలించారు. సోదరులు తమ రాజ్యాన్ని విభజించుకోవడంతో దొరప్పనాయుడు బి.కొత్తకోట మండలం గట్టు కొండపై అటవీప్రాంతంలో కొత్తగా పాళ్యం (గ్రామం) నిర్మించి దానికి అతనే పాలకునిగా ప్రకటించుకున్నాడు. ఈ విషయం తెలుసుకొన్న విజయనగర పాలకులు కప్పం కట్టాలని కుబురు పంపగా ధిక్కరించిన దొరప్పనాయుడు పాలన సాగించగా తర్వాత విజయనగర పాలనలోని వచ్చింది. ఇప్పటిలా అప్పట్లో ఇప్పటి గట్టు, దాని పరిసర గ్రామాల నిర్మాణం జరగలేదు. కొండపై అడవి ప్రాంతంలో పాళ్యం ఒక్కటే ఉండేది. పాళ్యం ప్రజలు సేద్యం, అడవిలో పండ్లు, పాడిపై ఆధారపడి జీవించారు. సేద్యం కోసం పాళ్యంకు ఇరువైపులా రంగప్ప చెరువు, పెద్దనాయుడు చెరువులను నిర్మించారు. ప్రజల భక్తివిశ్వాసాలకు అనుగుణంగా కొండకు ఎదురుగా పడమట వాకిలితో రంగనాథస్వామి ఆలయం, తూర్పు దిశగా శివాలయం నిర్మించారు. రెండు ఆలయాలకు వెనుకవైపుల్లో రెండు చెరువులు ఉండటం విశేషం. పాళ్యం చుట్టూ కోట గోడలు, ఎదురుగా ఉన్న గట్టు కొండపై కోట, ఆలయం, పీర్లచావిడి నిర్మించారు. ఇప్పుడు పాళ్యం కనుమరుగైనా చరిత్ర చెప్పే ఆధారాలు, కోట గోడలు, పూర్వకాల చరిత్ర ఆనావళ్లు తెలిపే శిల్పకళ, ఆలయాలపై శిలా శాసనాలు, నాటి పాలకుల గురించి తెలిపే శిల్పకళ ద్వారా నిక్షిప్తం చేశారు. అప్పట్లో మతసామరస్యం పరిడవిల్లిందని చెప్పేందుకు ఆలయాల గర్భగుడుల్లోని బండరాళ్లపై పీర్లను చెక్కారు. కాలగమనంలో పాళ్యం కనుమరుగయ్యే స్థితిలో పాళ్యం కిందకు వచ్చి గట్టు గ్రామంగా ఏర్పడింది.

శివలింగం ముక్కలు

రంగనాథస్వామి ఆలయానికి కుడివైపు రాతిబండపై శివాలయం నిర్మించారు. ఇటీవల గుప్త నిధుల కోసం ఆలయంలోని శివలింగం పగులగొట్టి ముక్కలు చేశారు. ఇందులో సగంగా ఉన్న రెండు ముక్కల శివలింగం గర్భగుడిలో ఉంచారు. గర్భగుడిలో నిర్మాణాలను ధ్వంసం చేశారు. ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన నంది విగ్రహం ఎత్తుకెళ్లిపోయారు. విగ్రహాలు పగులగొట్టిన అనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ బండరాళ్లతో ఆలయాన్ని నిర్మించగా వీటిని పడగొట్టారు. రాతి గోడల్లో నిధులు ఉంటాయని ధ్వంసం చేశారు. ఆలయంలోపలా, వెలుపల గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి.

ఆనవాళ్లనైనా రక్షిస్తారా..?

రంగనాథస్వామి ఆలయం పురావస్తుశాఖ పరిధిలో ఉంది. ఈ ఆలయాన్ని సంరక్షించడంలో యంత్రాంగం విఫలమైంది. ప్రస్తుతం ధ్వంసమైన ఆలయానికి చెందిన ఆనవాళ్లయిన బండలు, రాతి కూసాలు, లోపలి స్తంభాలను పరిరక్షించి ఆలయ మంటపాన్ని పునరుద్ధరిస్తే భవిష్యత్ తరాలకు ఇక్కడి చరిత్రను అందించినట్టవుతుంది. ఆలయ పరిసరాల్లోనే ప్రజలు నివసించిన ఇళ్ల నిర్మాణాల కట్టడాలు, కోట గోడ కట్టడం, బురుజులు, గ్రామంలోకి ప్రవేశించే సింహద్వార ముఖం ఇంకా సజీవంగానే కనిపిస్తున్నాయి. ఈ ఆనవాళ్లు కూడా చరిత్రలో కలిసిపోకుండా చర్యలు తీసుకోవాల్సివుంది. ఈ పరిస్థితిపై పురావస్తుశాఖ అధికారి శివకుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఆమోదం లభించలేదన్నారు. ఆలయాన్ని త్వరలో సందర్శించి ఆనవాళ్ల రక్షణకు చర్యలు తీసుకుంటామని, దీనికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు.

గోపురం కూల్చేశారు



రంగనాథస్వామి ఆలయ గర్భగుడి గోపురం (ఫైల్)

రంగనాథస్వామి ఆలయం పురావస్తుశాఖ ఆదీనంలో ఉంది. అధికారులు పట్టించుకోని కారణంగానే ఈ విధ్వంసం జరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండపై పాళ్యం విరాజిల్లినట్టుగా సాక్ష్యలుగా కనిపించిన వారసత్వ రంగనాథస్వామి ఆలయం ఉన్న చోట ప్రస్తుతం శిథిలాలు కనిపిస్తున్నాయి. ఆలయాల్లో గుప్త నిధులున్నట్టు వాటిని దక్కించుకోవడం కోసం ముఠాలు చాలా దారుణంగా వ్యవహరించాయి. 2022 డిసెంబర్ నాటికి ఆలయం కనిపించేది. గర్భగుడి, దానిపై చక్కటి శిల్పకళతో నిర్మించిన గోపురం కనిపించేది. పాళ్యం చరిత్ర తెలిపేలా గోపురంపై శిల్పకళతో వివరించారు. గోపురంపై సింహలు, అమ్మవారి విగ్రహం, పాలిచ్చే ఆవులు బొమ్మలు చెక్కారు. గర్భగుడిని పొడువాటి రాతిబండలతో నిర్మించగా వాటిపై శిల్పాలు, కొన్ని బొమ్మలు చెక్కారు. స్తంభాలపై శ్రీవెంకటేశ్వరుడు, గరుక్మంతుడు, వినాయకుడు, నాటి పాలనకు అద్దంపట్టే చిత్రాలను చెక్కారు. ఏనుగు, నెమలి, గుర్రం, శంఖు, చక్రాలు, వినాయకుడు, హనుమంతుడు, పువ్వులు కనిపిస్తాయి. గర్భగుడిలో నిర్మించిన బండపై శాసనాలు వేయించారు. ఆలయంలో రంగనాథస్వామి విగ్రహం ఏమైందో తెలియదు. గర్భగుడిలో లోతుగా తవ్వేశారు. దానిపైనున్న గోపురం తవ్వకాల దెబ్బకు లేదా అందులో నిధులపై అనుమానంతోనైనా కూల్చేశారు. సుందరమైన ఈ గోపురం శిథిలాలు కుప్పగా పడివున్నాయి. స్తంభాలు, వాటిపై కప్పుగా అమర్చిన రాళ్లను ధ్వంసం చేశారు. ఆలయం మధ్యలో పెద్ద గొయ్యిని తవ్వారు. ఆలయ ముఖద్వారం ద్వారం వద్ద స్తంభాలను ధ్వంసం చేసి లోతైన గొయ్యి తవ్వారు. ఎడమవైపు గోడలు, స్తంభాలు నేలమట్టం అయ్యాయి. చుట్టూ ముళ్లపొదలు నిండిపోయి శిథిలావస్థ కంటే దయనీయమైన దుస్థితిలో రంగనాథస్వామి ఆలయం అనవాళ్లు కనిపిస్తోంది.

గిరిజన గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్

పీలేరు: గిరిజన గురుకుల పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక కోటపల్లెలోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల సంక్షేమం, విద్యాభివృద్ధితోపాటు గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా గిరిజనులు ఉన్నారని, వారి అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి గిరిజన గ్రామానికి ప్రత్యేక గృహాలు, స్మశాన వాటికల సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన గురుకుల పాఠశాలలకు ప్రత్యేక భవనాలు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. 10 నుంచి 13 ఏళ్లుగా గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేవీపల్లె మండలం జిల్లేళ్లమంద పెద్దతండా వాసుల భూసమస్యలు పరిష్కరించాలని, గ్రామానికి స్మశానవాటికకు స్థలం కేటాయించాలని తహసీల్దార్ క్రాంతికుమార్‌కు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజస్విని, ప్రిన్సిపాల్ ఆర్. ప్రసాదరావు, ఈటీపీఆర్‌డీ లతీఫ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- చారిత్రక కట్టడాలను పరిరక్షించేందుకు చర్యలు
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



మట్లి రాజుల కోటలోని దర్గాలో పూజలు చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

సిద్దవటం: సిద్దవటాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని మట్లిరాజుల కోటను ఆదివారం సాయంత్రం రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పర్యాటక అధికారులతో కలిసి రాష్ట్ర పర్యాటక, సాస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లడుతూ చారిత్రక వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రెండవ శతాబ్దం నాటి మట్లి రాజులు నిర్మించిన అద్భుతమైన కోటలోని శివాలయం, మసీదు, దర్గా, విజయనగరం రాజుల శాలివాహన శకం విజయాభ్యుదయ బండను పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో చర్చించి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం పీపీపీ మోడల్‌లో ఇన్వెస్టర్లతో ఇటీవలే సమావేశాలను కూడా నిర్వహించామన్నారు. సిద్దవటం కోట చుట్టూ ఉన్న దేవాలయాలను పరిరక్షించి వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే ఈ ప్రాంతంలో సఫారీ, బోటింగ్, రెస్టారెంటు, సర్క్యూట్ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే ఇక్కడికి వచ్చే పర్యాటకులు బస చేసి ఇక్కడి ప్రాంతాలను సందర్శించుకొనే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలోని గండికోటకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారం అందించిందని, అలాగే ఇతర ప్రాంతాల్లో కూడా సహకారాన్ని తీసుకొని ఏకో టూరిజం, టెంపుల్ టూరిజం, వెల్నెస్ టూరిజంను అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా లోని ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటిని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి సురేష్‌కుమార్, జనసేన నాయకులు అతికారి కృష్ణ, తాతంశెట్టి నాగేంద్ర, రెడ్డి రాణి, జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాసులు, రాటాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో కాల్పుల కలకలం

వ్యాపారులే టార్గెట్‌గా దుండగులు రెచ్చిపోయారు. ఒక్కసారిగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు సరిహద్దున ఉన్న అటవీ ప్రాంతంలో తుపాకుల కాల్పులకు అక్కడి వారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లాలో కలకలం సృష్టించింది.

- చిరు వ్యాపారులపైకి దూసుకువచ్చిన తుపాకి గుళ్లు
- మాధవరం–కాటిమాయకుంట అటవీ ప్రాంతంలో ఘటన
- ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐలు



మృతి చెందిన హనుమంతు



చికిత్స పొందుతున్న వెంకటరమణ

రాయచోటి/కడప అర్బన్: అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ మండలం మాధవరం–కాటిమాయకుంట గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో తుపాకీ కాల్పులు కలకలం సృష్టించాయి. పేల్చిన తుపాకీ గుళ్లు పూసలు, చిక్కు వెంట్రుకల వ్యాపారుల కడుపుల్లో దూసుకుపోయాయి. ఈ ఘటనలో ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరొకరు మృత్యువాత పడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో అటవీ ప్రాంత ప్రదేశంలో తుపాకీని పేలచ్చారు. అసలు ఆ సమయంలో గ్రామాలు తిరిగి పూసలు అమ్ముకునే వారికి ఆ అటవీ ప్రాంతంలో పనేముంది.. వీరినే తుపాకులతో మూడు సార్లు ఎందుకు కాల్చారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలలోకి వెళ్లితే... సంబేపల్లె మండల కేంద్రంలో సల్ల రమణ (30), నీలకంఠ హనుమంతు(45) కుటుంబంతో కలిసి చుట్టుపక్కల గ్రామాలలో పూసలు, చిక్కు వెంట్రుకలు, డబ్బా రేకులతో తయారుచేసిన కొన్ని పరికరాలను అమ్ముకుని జీవనం సాగించేవారు. అలాగే వారికి కొన్ని మేకలు కూడా ఉన్నాయి. స్థానికంగా మేకలకు తగిన ఆహారం లేకపోవడంతో రాయచోటి రూరల్ మండల పరిధిలోని కాటిమాయకుంట అటవీ ప్రాంత పరిధిలో వాటిని మేపుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. ఇదే క్రమంలో సమీప గ్రామాల్లో పర్యటిస్తూ చిరు వ్యాపారం ద్వారా బియ్యం, డబ్బులు పొంది కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు కొండ అవతల ఉన్న మాధవరం గ్రామ పరిధిలోని మద్దెలకుంట గ్రామానికి బయలు దేరినట్లు ప్రమాదంలో గాయపడిన రమణ తెలిపారు. ఐదు గంటల సమయంలో రెండు గ్రామాల మధ్యలో ఉన్న అటవీ ప్రాంతంలో ఇద్దరం నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా తుపాకీ తూటాలు మా పొట్టల్లోకి దూసుకువెళ్లాయన్నారు. ఈ దాడిలో సల్ల రమణ(30) కడుపులోకి తూటాలు చొచ్చుకెళ్లాయి. అలాగే పక్కన ఉన్న నీలకంఠ హనుమంతు(45) కడుపులోకి మరో తూటా దూసుకు వచ్చిందని బాధితుల నోట వినిపించాయి. తూటాలకు గాయపడి రక్తం పారుతున్నా వాటిని బిగ పట్టుకుని అక్కడ నుంచి కేకలు వేస్తూ కాటిమాయకుంట సమీపంలో తామున్న ప్రదేశాలకు (గుడారాల వద్దకు) చేరుకున్నామన్నారు. అక్కడ నుంచి ఆటోలో రక్తంతో తడిచిపోయిన వారిద్దరు చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. ఇరువురికీ కడుపులో తూటాలు ఉండటంతో మెరుగైన అత్యవసర చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నీలకంఠ హనుమంత మృతిచెందాడు. రమణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే తుపాకులతో కాల్చిన ప్రదేశంలో ఎవరున్నది చూడలేదని, సమీపంలో స్కూటర్ ఉన్నట్లు గుర్తించామని వారు పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

సంఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ

తుపాకులతో కాల్చిన ప్రదేశాన్ని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ చంద్రశేఖర్ సందర్శించారు. సంఘటన జరిగిన ప్రదేశాన్ని పూర్తిగా పరిశీలించడంతో పాటు గ్రామ పరిధిలో నాటు తుపాకులు ఉపయోగించే వారి వివరాలను సేకరించాలని కింది స్థాయి సిబ్బందిని డీఎస్పీ ఆదేశించారు. అలాగే జాగిలాలతో ఆ ప్రాంతంలోని ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తుపాకులతో కాల్చిన వారు అడవి జంతువుల కోసం వచ్చారా? లేక మరేదైనా కుట్ర కోణం దాగి ఉందా అన్న అనుమానాలపై విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. జరిగిన సంఘటనపై రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. మూడు బృందాలుగా ఏర్పడి సంఘటనకు దారి తీసిన పరిస్థితులపై విచారణ సాగిస్తున్నట్లు ఆయన వివరించారు.

భిక్షమెత్తుకుని జీవనం సాగిస్తున్నాం

మా జీవనం ఊరూరా తిరిగి చిక్కు వెంట్రుకలు సేకరించుకుంటూ, పూసలు అమ్మడం, డబ్బా రేకులతో తయారు చేసిన చాటలు అమ్ముకోవడం, వారిచ్చిన చిల్లర, బియ్యంతో కుటుంబాన్ని పోషించుకోవడం మా వృత్తి అని బాధితుల కుటుంబ సభ్యులు చెబుతున్నారు. వీటికి తోడు కొన్ని మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తుపాకీ తూటాలకు గాయపడ్డ మా బిడ్డలను రక్షించుకోవడానికి మా దగ్గర ఆర్థికస్తోమత లేదంటూ ఆ మహిళలు ఆసుపత్రి ఆవరణంలో బోరున విలపించారు. మా బిడ్డలపై ఎందుకు కాల్పులు జరిపారో మాకు తెలియదని వాపోయారు.

ముంపు ప్రాంత సమస్యలను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి



తప్పెటవారిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ఒంటిమిట్ట: సోమశిల వెనుక జలాలతో ఇబ్బంది పడుతున్న మండల పరిధిలోని తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా అడుగులు వేస్తామని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా సోమశిల వెనుకజలాలు వచ్చి చేరే హద్దులను ఆయన పరిశీలించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిరి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఈ గ్రామాలను ఎంపిక చేయాలని కోరడం జరిగిందని, కానీ నిర్ణయం తీసుకునేలోపే శాసనసభ ఎన్నికలు రావడంతో ఈ గ్రామల సోమశిల వెనుకజలాల సమ్యలు అలాగే ఉండిపోయాయన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అనంతరం తప్పెటవారిపల్లిలో మీసేవా సుబ్బారెడ్డి కుమారుడి కేశఖండన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ ముమ్మడి నారాయణ రెడ్డి, బ్యాంకు శివారెడ్డి, మనోహర్ రెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

26 నుంచి ఖాదర్‌వలీ దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ : స్థానిక దర్బీపేటలోని హజ్రత్ సయ్యద్ ఖాదర్‌వలీ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 26 నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు ఇలియాజ్ తెలిపారు. 26వ తేదీ గంధం, 27వ తేదీ ఉరుసు, అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. 28వతేదీన తహలీల్ ఫాతెహా సాయంత్రం జరుగుతుందన్నారు. హిందూ, ముస్లిం సోదరులు ఉరుసులో పాల్గొని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

ఆటో దగ్ధం



దగ్ధమైన ఆటో

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లి దళితవాడకు చెందిన సత్యాల ప్రదీప్‌కు చెందిన ఏపీ39యూఈ 7344 నంబరు గల ఆటోను ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఆటోను ఇంటిదగ్గర ఉంచి నిద్రపోతుండగా ఈ ఘటన జరిగింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌కు కానిస్టేబుల్

రాయచోటి : రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి.ధర్మాను వీఆర్‌కు పంపారు. స్టేషన్ పరిధిలోని మాధవరం గ్రామం, కంచరపల్లికి చెందిన ఓ విద్యార్థిపట్ల దురుసుగా ప్రవర్తించడంతో ఆ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. అలాగే పలు ప్రైవేటు పంచాయితీలు చేశారన్న సమాచారం మేరకు పోలీస్ ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు సమాచారం.


కనుగొండ అడవిలోకి వెళ్లొద్దు

ములకలచెరువు : మండలంలోని కనుగొండ అడవిలోకి మేకలు, గొర్రెల కాపరులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ సెక్షన్ అధికారి షబీన్ తెలిపారు. ఆదివారం ఆమె పెద్దపాళ్యంలో కాపరులతో సమావేశం నిర్వహించి అవగాన కల్పించారు. గతంలో కనుగొండ అడవిలో చిరుత పులులు సంచరించినట్లు గుర్తు చేశారు. అడవిలోని కోతులు, జింకలను వేటాడి తిన్నట్లు ఆనవాళ్లు ఉన్నాయన్నారు. పులులు సంచరించిన పాదముద్రలు గుర్తించామన్నారు. అడవిలో చిరుత పులులు, నక్కలు ఉన్నట్లు తెలిపారు. భయపడాల్సిన అవసరం లేదని పులులు, నక్కలు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు.

క్రిస్మస్ కోలాహలం



పశువుల పాకలో బాలఏసు



ఆర్‌ఎస్‌రోడ్డులో విద్యుత్ దీపకాంతులతో చర్చి

- రేపు రాత్రి నుంచి ప్రారంభం కానున్న వేడుకలు
- విద్యుత్ దీపకాంతుల్లో చర్చిలు
- ఇప్పటికే మొదలైన ప్రత్యేక ప్రార్థనలు
- గృహాలపై విద్యుత్ వెలుగుల్లో స్టార్లు
- పశువుల పాకలు, క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు

రాజంపేట టౌన్ : లోకాన్ని రక్షించేందుకు సృష్టికర్త అయిన యెహోవా తన ప్రియ కుమారుడైన ఏసుక్రీస్తును భువికి పంపాడని క్రైస్తవుల విశ్వాసం. ఏసుక్రీస్తును ఈ భూమికి కానుకగా ఇచ్చిన పవిత్ర దినమే క్రిస్మస్. కాగా మంగళవారం రాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభం కానుండటంతో జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ కోలాహలం కనిపిస్తోంది. చర్చిలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించడంతో కొత్త శోభను సంతరించుకున్నాయి. గత కొద్ది రోజులుగా క్రైస్తవులు, విశ్వాసులు క్రిస్మస్ ఆగమనాన్ని పురస్కరించుకొని చర్చిల్లో, తమ ఇళ్లల్లో సెమీక్రిస్మస్, సపోస్ క్రిస్మస్ పేరిట ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. జెరుసలేంలోని బెత్లహేంలో ఓ పశువుల పాకలో ఏసుప్రభువు జన్మించారు. అందువల్ల క్రైస్తవులు తమ ఇళ్లల్లో, చర్చిల్లో క్రీస్తు జననానికి చిహ్నంగా పశువుల పాకలను ఏర్పాటు చేసుకున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని చర్చిల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా పాస్టర్లు క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలియజేస్తున్నారు. అలాగే యువత క్రిస్మస్‌ను స్వాగతించేందుకు పాటలను సాధన చేస్తున్నారు.

మంచి ప్రవర్తనగల పిల్లలకు బహుమతులిచ్చే క్రిస్మస్ తాత

క్రిస్మస్ వేడుకల్లో క్రిస్మస్ తాతకు ఓ ప్రత్యేకత ఉంది. క్రిస్మస్ తాత రాత్రి వేళల్లో రథంపై ఆకాశ మార్గాన పయనిస్తూ మంచి ప్రవర్తనగల పిల్లలకు బహుమతులు ఇస్తాడని, చెడు ప్రవర్తనగల పిల్లలకు బొగ్గు ఇస్తాడని విశ్వసిస్తారు. 1823 నుంచి క్రిస్మస్ తాత ప్రాచుర్యం పొందినట్లు క్రైస్తవులు చెబుతున్నారు. సెయింట్ నికోలస్ అనే గ్రీకు బిషప్ స్ఫూర్తితో శాంతాక్లాజ్ అనే ఒక పాత్ర రూపుదిద్దుకుంది. అమెరికా, బ్రిటన్ దేశాల్లో శాంతాక్లాజ్ వర్ణనపై రచించిన ఏ విజిట్ ఫర్ సెయింట్ నికోలస్ అనే కవిత ఆధారంగా థామస్‌నెస్ట్ అనే చిత్రకారుడు శాంతాక్లాజ్ ఊహా చిత్రాన్ని గీశాడు. దీని ఆధారంగా క్రిస్మస్ తాత ప్రాచుర్యం పొందినట్లు విశ్వాసులు చెబుతున్నారు.

క్రిస్మస్ ట్రీకి ఎంతో ప్రాధాన్యత

క్రిస్మస్ వేడుకల్లో క్రిస్మస్ ట్రీకి కూడా క్రైస్తవులు, విశ్వాసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని క్రైస్తవులు, విశ్వాసులు విధిగా తమ ఇళ్లల్లో, ఇంటి ముంగిట క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేస్తారు. ప్రపంచ దేశాల్లో ఒకొక్క దేశంలో క్రిస్మస్ ట్రీకి సంబంధించి పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఆధునిక జర్మనీ ఏర్పడిన తరువాత క్రిస్మస్ ట్రీ ప్రాచుర్యంలోకి వచ్చినట్లు క్రైస్తవులు చెబుతున్నారు. 16వ శతాబ్దంలో మార్టిన్ లూథరస్ మొదటిసారిగా ఎవర్‌గ్రీన్ అనే చెట్టును కొవ్వొత్తులతో అలంకరించారంటారు. నిత్యజీవనానికి సంకేతంగా క్రిస్మస్ ట్రీని అలంకరిస్తారు.

ఆ శుభ ఘడియ కోసం ఎదురు చూస్తున్నాము

క్రిస్మస్ మానవాళికి శుభదినం. క్రీస్తు ప్రబోధించిన సుగుణాలు, పరిశుద్ధత, పవిత్రత, తగ్గింపు స్వభావం, ప్రేమ, త్యాగం, దయా గుణాలు అలవరుచుకోవడమే క్రిస్మస్ సందేశం. అందువల్ల ఆ శుభ ఘడియకోసం వేయికళ్లతో ఎంతో సంతోషంగా ఎదురు చూస్తున్నాము.



తంబెళ్ల నరసింహారెడ్డి, విశ్వాసుడు, రాజంపేట

భూమి సమస్య పరిష్కరించలేదని టవర్ ఎక్కిన రైతు



బాధితుడిని అదుపులోకి తీసుకొన్న అర్బన్ సీఐ చంద్రశేఖర్

రాయచోటి టౌన్ : తన భూమి సమస్య పరిష్కరించలేదని ఆగ్రహించి రామ్మోహన్ నాయుడు అనే రైతు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతూ హల్ చల్ చేశాడు. రాయచోటి ఫైర్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి కథనం మేరకు.. రాయచోటి పట్టణ పరిధిలోని అబ్బవరం కొత్త కురవపల్లెకు చెందిన రామ్మోహన్ నాయుడు తన ఆస్తి సమస్యను పరిష్కరించాలంటూ దాయాదులను గత ఐదేళ్లుగా కోరుతున్నాడు. అయితే అందుకు వారు ససేమిరా అనడంతో పాటు పెడచెవిన పెట్టారు. దీంతో ఆయన మనస్థాపానికి గురై ఆదివారం రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులోని సెల్ టవర్ ఎక్కాడు. గమనించిన పోలీసులు ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని బాధితుడిని సముదాయించి కిందికి దింపారు. బాధితుడిని రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అరుణ్ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి సుబ్బరాయుడు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణం కడప-రేణిగుంట జాతీయ రహదారిలో రాజ్ రెసిడెన్సీ వద్ద రాఘవరాజపురం దళితవాడకు చెందిన పైనమ్ అరుణ్ (29)ను లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడికి రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. తండ్రి పైనమ్ సుబ్బరాయుడు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

రాయచోటి (జగదాంబసెంటర్) : పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నమయ్య జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బి.వెంకటరమణ అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో జిల్లా పెన్షనర్ల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సంఘాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 70 ఏళ్లు నిండిన రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రెడ్డికుమార్, ట్రెజరర్ జయచంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు నరసింహులు,

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : మండల పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం దాదంవారిపల్లెకు చెందిన ఇర్ఫాన్(20), మదనపల్లె అమ్మచెరువుమిట్టకు చెందిన నిఖిల్(20) ఇద్దరూ కలిసి ఆదివారం మధ్యాహ్నం పుంగనూరురోడ్డులోని దాబాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మదనపల్లెకు వస్తూ వలసపల్లె నవోదయ పాఠశాల సమీపంలో ముందు వెళుతున్న బస్సు, లారీని ఓవర్‌టేక్ చేస్తూ, ఎదురుగా బస్సు రావడంతో దాన్ని తప్పించపోయి అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిఖిల్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఇర్ఫాన్ స్థానికంగానే చికిత్స పొందుతున్నాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కర్నాటక చిక్‌బళ్లాపూర్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న రవి(35), లోకేష్ (29) స్నేహితులు. ఇద్దరూ కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లేందుకు ఆదివారం ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో వాల్మీకిపురం మండలం విఠలం సమీపంలో ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడటంతో గమనించిన స్థానికులు ఇద్దరినీ 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాల్మీకిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డు లెక్చరర్ అదృశ్యం

రామాపురం : మండల పరిధిలో బండపల్లె ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఉంటున్న నాగూరు వెంకటరెడ్డి (70) అనే రిటైర్డు లెక్చరర్ 18వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య వెంకటలక్ష్మి ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనికి మతిస్థిమితం సరిగా లేదని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు మండల పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మిట్స్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట : అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం బెంగళూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మిట్స్ అలుమిని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనంలో దేశంలో వివిధ ప్రాంతాలలో ఉద్యోగ, వ్యాపార, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. తమ ఉన్నతికి తోడ్పడిన కళాశాల సేవలు మరుపురానివని తలచుకున్నారు. మధుర స్మృతులను పరస్పరం పంచుకున్నారు. ఆద్యంతం ఉల్లాసంగా గడిపారు. త్వరలో కళాశాల స్థాయి పెరుగుతుండడంతో ముందుగా యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల విద్యార్థులు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్నారని ప్రిన్సిపాల్ యువరాజ్ అన్నారు.

ఫారెస్టు జూనియర్ ఆఫీసర్స్ సంఘం రాష్ట్ర కోశాధికారిగా కేవీ సుబ్బయ్య



కేవీ సుబ్బయ్య

రాజంపేట : ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా అన్నమయ్య జిల్లా నుంచి చిట్వేలి రేంజ్‌లో ఎఫ్‌బీఓగా పనిచేస్తున్న కేవీ సుబ్బయ్య ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతిలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. కేవీ సుబ్బయ్యను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. కాగా ఈయన 2008లో అటవీశాఖలో బీట్ ఆఫీసర్‌గా చేరారు. రైల్వేకోడూరు, రాజంపేట రేంజ్‌లలో ఎఫ్‌బీఓగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన కోశాధికారి పదవికి న్యాయం చేసే విధంగా పనిచేస్తానన్నారు.

హైందవ శంఖారావం సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భానుప్రకాష్

రాయచోటి అర్బన్ : జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఏపీ సురక్ష ప్రముఖ్ పెంచలరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో హిందూ సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భానుప్రకాష్ మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించి ఒక ఉత్తమ ధార్మిక సంస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు.

బోడిశెట్టిపల్లిలో కొండచిలువ

అట్లూరు : మండల పరిధిలోని బోడిశెట్టిపల్లి గ్రామంలో శనివారం రాత్రి కొండచిలువ కనిపించింది. గ్రామంలో ఉన్నట్లుండి గొర్రెలు, మేకలు బెదురుకోవడంతో గ్రామంలోని కొంత మంది మహిళలు వచ్చి పరిశీలించగా సుమారు పది అడుగుల పొడవు గల కొండచిలువ కనిపించింది. వారు కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి కొండచిలువను చంపి వేశారు.

మద్యం మత్తు.. ప్రాణాలు చిత్తు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైకు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోలాటం నరసింహులు



మృతి చెందిన కె.సుజాత



తీవ్రంగా గాయపడిన చరణ్ తేజ్



చికిత్స పొందుతున్న త్రిషాన్వీ

బైకును ఢీకొన్న ఆటో

- దంపతుల దుర్మరణం
- కుమారుడి పరిస్థితి విషమం
- మద్యం మత్తులో ఆటో నడపడమే ప్రమాదానికి కారణం



కోలాటం నరసింహులు, సుజాత (ఫైల్ ఫొటో)

ఓబులవారిపల్లె : మద్యం మత్తు, అతి వేగం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. మద్యం తాగి ఆటోను నడుపుతూ ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొనడంతో రాజంపేట మండలం, భువనగిరిపల్లి గ్రామానికి చెందిన కోలాటం నరసింహులు (42), భార్య సుజాత (38) దుర్మరణం చెందారు. వారి కుమారుడు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాలు ఇలా.. భువనగిరిపల్లికి చెందిన కోలాటం నరసింహులు తన అత్తగారి ఊరైన ఓబులవారిపల్లి మండలం, వై.కోట గ్రామానికి వచ్చి తన భార్య, కుమారుడు చరణ్, తమ్ముడి కుమార్తె త్రిషాన్వీతో కలిసి పల్సర్ బైకుపై ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో వై.కోట నుంచి బయల్దేరారు. రెడ్డిపల్లి చెరువుకట్ట వద్దకు రాగానే టాటా ఏస్ లగేజీ ఆటో వేగంగా వచ్చి బైకును ఢీ కొంది. దీంతో బైకు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. నరసింహులు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన భార్య సుజాతను రాజంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కుమారుడు చరణ్ తేజ్ (12) పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. నరసింహులు తమ్ముడి కుమార్తె త్రిషాన్వీ చికిత్స పొందుతోంది. మద్యం మత్తులో బైకును వేగంగా ఢీ కొని టాటా ఏస్ వాహనం వెళ్లిపోయింది. ఆటో కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇంటి నుంచి బయల్దేరిన అరగంటలోనే కుమార్తె చనిపోయిందన్న చేదు వార్తను విని సుజాత తల్లిదండ్రులు, బంధువులు గుండెలు పగిలేలా రోదించారు. భువనగిరిపల్లిలో బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నరసింహులుకు భార్య సుజాత, కుమారుడు చరణ్ తేజ్ ఉన్నారు. గ్రామంలో మంచి పేరు తెచ్చుకున్న నరసింహులు ఇటీవల అయ్యప్పస్వామి మాల ధరించి శబరిమలైకు వెళ్లి వచ్చి అత్తగారింటికి వెళ్లి వస్తుండగా ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో వై.కోట, భువనగిరిపల్లి గ్రామాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ పి.మహేష్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన బాలసుబ్రమణ్యం

ములకలచెరువు : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం తెల్లవారుజామున మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా గంగవరం మండలం మారూడుగుకు చెందిన గజ్జెల బాలసుబ్రమణ్యం(31)కు భార్య నవనీత్, ఇద్దరు పిల్లలు సంతానం. ఇతను మండలంలోని కాలువపల్లె సమీపంలోని ఒక కోళ్లఫారంలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇక్కడికి రాకముందే అప్పులు ఉండేవన్నారు. ఇక్కడ నెలకు రూ.21 వేలు మాత్రమే వచ్చేవని.. కుటుంబాన్ని పోషించడానికే డబ్బులు సరిపోతున్నాయని... అప్పులు తీర్చేదెలా అంటూ అప్పుడప్పుడు బాధపడుతుండేవాడని తెలిపారు. డబ్బులు నిదానంగా సంపాదించుకొని అప్పులు తీర్చుకోవచ్చని భార్య నవనీత్, బాలసుబ్రమణ్యం అన్నయ్య గంగాధర్ అనేక సార్లు చెప్పారన్నారు. మనస్థాపానికి గురైన బాలసుబ్రమణ్యం తెల్లవారుజామున కోళ్లఫారంలో ఉరి వేసుకున్నాడు. కోళ్లఫారంలో ఉన్న వారు గమనించి సమీపంలోని సత్యసాయి జిల్లా ఎన్పీ కుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య, అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ భాస్కర్ నాయక్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి

లింగాల : విద్యుత్ షాక్‌తో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి చెందిన ఫరూక్ అహమ్మద్(60) అనే లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్‌ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు.. లింగాలలో అరటి కాయల వ్యాపారి గోడౌన్ సమీపంలో మరో లారీలోకి బాక్సులు మార్చేందుకు విద్యుత్ లైన్ కిందకు వెళ్లడంతో విద్యుత్ వైరు తెగి పడింది. సమీపంలో లారీ డ్రైవర్ ఫరూక్ అహమ్మద్ నీటితో లారీని శుభ్రం చేస్తుండగా విద్యుత్ వైర్లు ఆయనపై పడ్డాయి. తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని చిన్నారి మృతి



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గుర్రంకొండ: రోడ్డు పక్కన ఆడుకుంటున్న చిన్నారిని కారు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. గ్రామానికి సమీపంలోని గాజులవారిపల్లె క్రాస్ వద్ద కడప-బెంగళూరు జాతీయ రహదారి పక్కన ఓ కోళ్లఫారంలో పని చేసేందుకు బీహార్ రాష్ట్రం నుంచి కూలీలు వచ్చారు. కొన్నినెలలుగా కొన్ని కుటుంబాల వారు అక్కడే పనిచేసుకొంటూ నివాసముంటున్నారు. కోళ్లఫారంలో పనిచేసే అబ్దుల్ కరీమ్ హుస్సేన్ కుమారుడు మహమ్మద్ హుస్సేన్(08) ఆదివారం రోడ్డు దాటి అక్కడ టీకొట్టులో బిస్కెట్లు తీసుకొని వచ్చాడు. రోడ్డు పక్కనే ఆడుకొంటూ ఉండగా రాజంపేట నుంచి బెంగళూరు వెళుతున్న కారు రోడ్డులో ఉన్న గోతుల్ని తప్పించబోయి బాలుడిని ఢీకొంది. ఈ సంఘటనలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్దకు తీసుకెళ్లారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దళితులపై చిన్నచూపు తగదు



రెడ్డెప్పను పరామర్శిస్తున్న జయప్రకాష్, శ్రీనివాసులు తదితరులు

కలకడ : ఎస్సీ, ఎస్టీలపై చిన్నచూపు తగదని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జయప్రకాష్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుంట శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని ఎనుగొండపాళ్యెం పంచాయతీ బండమీదపల్లె ఎస్సీ కాలనీకి చెందిన యాకల రెడ్డెప్పను పరామర్శించారు. ఈ నెల 17వతేదీన అదే పంచాయతీకి చెందిన మహేష్ నాయుడు, వీరాంజనేయులు నాయుడు, ప్రసాద్ నాయుడులు కలిసి కులంపేరుతో దూషించి, దాడి చేయడంపై 19వతేదీన కలకడ పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో బాధితుడిని ఆదివారం వారి ఇంటివద్దకు వెళ్లి పరామర్శించి, దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలకడ మండల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుంట నరసింహులు, ఎస్సీ సంఘం నాయకుడు గుంటూరు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పొట్టిపాడు రోడ్డులో కంచెర్ల శ్రీకాంత్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి గోవా రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ఉప్పాగు వద్ద మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డి సిబ్బందితో కలసి ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాడిలో కంచెర్ల శ్రీకాంత్ అనే వ్యక్తిని అరెస్టు చేసి గోవా రాష్ట్రానికి చెందిన 12 మద్యం బాటిళ్లతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.